రెండో రోజు సజావుగా గ్రూప్-1

● సమయంలోపే వచ్చిన అభ్యర్థులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 22 : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష-2024 రెండో రోజు సజావుగా జరిగాయి. మంగళవారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రెండు పరీక్షా కేంద్రాలలో గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు సమయంలోపే వచ్చారని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు. కోఠి మహి ళా వర్సిటీలో వింగ్ -ఏలో 792 మంది అభ్యర్థులకు గాను 729 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వింగ్-బిలో 864 మంది అభ్యర్థులకు గాను 783 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇదిలా ఉండగా వివేక వర్ధిని కళాశాలలో 528 మంది అభ్యర్థులకు గాను 455 మంది పరీక్ష రాశారని ఇన్‌స్పెక్టర్ శ్రీని వాసాచారి తెలిపారు. బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా ప్రియ దర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో 696 మంది అభ్యర్థులకు గాను 604 మంది పరీక్షలకు హాజరయ్యారని ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం..దాడిపై సీఎం వాస్తవాలు మాట్లాడాలి

ముత్యాలమ్మకు పూజలు చేసిన ఎమ్మెల్యే టి. రాజాసింగ్

అబిడ్స్, అక్టోబర్ 22 : సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాలు మాట్లాడాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ఆయన పోలీస్ బందోబస్తు మధ్య సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. నిరసన తెలిపిన హిందూ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేసి గాయాల పాలు చేశారని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆలయాలను బస్తీ వాసులే కాపాడుకోవాలని కోరారు. రాజాసింగ్ వెంట గోషామహల్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ ఉన్నారు.

గుత్తా అమిత్‌రెడ్డికి సన్మానం

విజయ డెయిరీ చైర్మన్‌గా నియమితులైన గుత్తా అమిత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. గుత్తా అమిత్ రెడ్డి నివాసంలో చార్మినార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ కె. వెంకటేశ్ కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మలిపెద్ది అంబరీష్‌రెడ్డి, అనంతుల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్, అక్టోబర్ 22

ప్రజా సేవలో.. ముందంజలో ఉండాలి



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కలిసిన కార్వాన్ బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, సత్యం, సత్యనారాయణ తదితరులు

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మెహిదీపట్నం, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సేవలో ముందంజలో ఉండాలని, నిరాశ చెందకుండా ఉత్సాహంగా పనిచేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు గత సీఎం కేసీఆర్ అందించిన పథకాలను గుర్తు చేసి వారికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరెళ్ల జగదీశ్‌యాదవ్, రంగారెడ్డి గున్నాల, చంద్రకాంత్ నాగుల, నంతోట పల్లవి, విజయలక్ష్మి, ముత్యాల భాస్కర్, సత్యం, పద్మ, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా కార్తీక్‌రెడ్డి..

కార్వాన్ : బీఆర్ఎస్ నగర ఇన్‌చార్జిగా నియమితులైన పి. కార్తిక్‌రెడ్డిని కార్వాన్ బీఆర్ఎస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్వాన్ బీఆర్ఎస్ నాయకులు అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసుకొని, నూతన డివిజన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, సమిష్టి కృషితో పార్టీని మరింత బలంగా మార్చాలని, ప్రజా సమస్యల పై దృష్టి సారించి పోరాటం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. తాను త్వరలోనే కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించి బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ఏకతాటి పైకి తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్వాన్ బీఆర్ఎస్ నాయకుడు అంబటి శ్రీనివాస్, నాయకులు జగ్గు యాదవ్, క్రిష్ణదాస్, రాములు, తిరుమలేశ్, ముత్యాల భాస్కర్, సత్యనారాయణ, చంద్రకాంత్, కార్తీక్, శ్రీనివాస్, రాకేశ్, జ్యోతిరాజ్, పల్లవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక్‌రెడ్డితో కార్వాన్ బీఆర్ఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, ఆరెళ్ల జగదీశ్‌యాదవ్, చంద్రకాంత్, ముత్యాల భాస్కర్, రంగారెడ్డి, పల్లవి, కృష్ణాదాస్, పద్మ తదితరులు

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్ల అధ్యయనం

మెహిదీపట్నం, అక్టోబర్ 22 : ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేయడానికి రోడ్ల అభివృద్ధి కోసం ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం సాయంత్రం లంగర్‌హౌస్ ప్రాంతంలో పర్యటించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల అభివృద్ధి ఎంతో అవసరమని, దీని కోసం జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గోషా మహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, జీహెచ్ఎంసీ ఏఈ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో పర్యటిస్తున్న గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ధనలక్ష్మి, అంజయ్య తదితరులు

హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమ్రం భీం

కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో కొమ్రం భీం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మహిళా విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ధరావత్ సూర్య ధనుంజయ్, వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ సరస్వతమ్మ తదితరులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 22 : జల్ జంగిల్ జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కుల, ఆత్మ గౌరవం కోసం నిజాం సర్కార్‌తో ఎడతెరపి లేకుండా పోరాటం చేసిన యోధుడు కొమ్రం భీం అని వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ధరావత్ సూర్య ధనుంజయ్ అన్నారు. మంగళవారం గోండు సింహం కొమ్రం భీం జయంతిని పుర స్కరించుకొని వర్సిటీలోని వీసీచాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె కొమ్రం భీం చిత్రపటానికి వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ సరస్వతమ్మతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పీఆర్‌వో డాక్టర్ క్రిష్ణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ డాక్టర్ శైలజ, డైరెక్టర్ ఆఫ్ హాస్టల్స్ డాక్టర్ విజయలక్ష్మితో పాటు వర్సిటీ భోధన, బోధ నేతరులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భూలక్ష్మీదేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మారుతీనగర్ శ్రీ భూలక్ష్మీదేవి, నాగులమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు మంగళవారం పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మారు బోనం ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

– గోల్నాక, అక్టోబర్ 22

కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడండి

వెటర్నరీ డాక్టర్లతో సమావేశమైన కార్పొరేటర్ పద్మారెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కుక్కలు, కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సంబంధిత వెటర్నరీ అధికారులకు చెప్పారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో వెటర్నరీ డాక్టర్లు సద్గుణ రెడ్డి, వనజకుమారితో కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుక్కలు, కోతుల బెడద పై ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రక్షణ చట్టాలకు కొమ్రం భీం ఆద్యుడు



కొమ్రం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేనావత్ రాంబాబునాయక్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 22 : రాష్ట్రంలో గిరిజన రక్షణ చట్టాలు రావడానికి కొమ్రం భీం ఆద్యుడని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబునాయక్ అన్నారు. కొమ్రం భీం జయంతి సందర్భంగా మంగళవారం నిజాం కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయ ఆవరణలో కొమ్రం భీం చిత్రపటానికి ఆయన వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి లతో కలిసి నివాళులర్పించారు. కొమ్రం భీం స్ఫూర్తితో విద్యార్థులు సమాజ సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కళాశాల ప్రొఫెసర్ రమణనాయక్, అధ్యాపకులు డాక్టర్ కిశోర్, డాక్టర్ ధరావత్ సాంబశివ, డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సర్వకళాకారుల సంక్షేమ వేదిక వార్షికోత్సవాలు

అభిమన్యు, మంజుల శ్రీనివాస్‌ను మెమెంటోతో సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, అక్టోబర్ 22 : సర్వకళాకారుల సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవాలు, కళాకారులకు ఘన సత్కార కార్యక్రమం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి విచ్చేసి కళాకారులకు సర్వకళాకారుల సంక్షేమ వేదిక ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. సభకు ముందు కళాకారులు పాటలను పాడి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సారిపల్లి కొండల్‌రావు, లంకా లక్ష్మీ నారాయణ, జి.మల్లికార్జునరావు, వి.సుబ్రమణ్యం, రామచంద్రరావు, అశోక్‌కుమార్, జీకే రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల అభివృద్ధికి కృషి చేస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న కర్మచారీస్ అసోసియేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వీరరాజు

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 22 : సఫాయి కర్మచారుల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రొగ్రెస్సివ్ సఫాయి కర్మచారీస్ అసోసియేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వీరరాజు అన్నారు. మంగళవారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని దేవాంగ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో సఫాయి కర్మచారీస్ అసోసి యేషన్ తెలంగాణ శాఖ మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ రహమాన్ పఠాన్ సఫాయి కర్మచారీల కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరికరాల విస్తరణపై చర్చలు జరుగడం జరిగిందని వివరించారు. అసోసియే షన్ జాతీయ సెక్రటరీ జనరల్ దీపక్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ వ్యా ప్తంగా సఫాయి కర్మచారీలు ఎలాంటి భద్రతా పరికరాలు లేకుండా దయనీయమైన పరిస్థితుల్లో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ రహిమాన్ పఠాన్ మాట్లాడుతూ.. తెలంగాణలో రాష్ట్ర శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, సంఘం బలోపేతంపై చర్చలు జరుగడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ ప్రొగ్రెస్సివ్ సఫాయి కర్మచారీస్ అసోసియేషన్ తెలంగాణ శాఖకు నూతనం గా ఎన్నికైన సభ్యుల వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సలహాదారులు పి. విజయ లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె. అరు ణ, బి. కరుణాకర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కబీర్ దాస్, జిల్లా కార్యదర్శి సోనమ్ కాగ్డాతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు.

మహిళా బిల్లులో ఉపకోటా కల్పించాలి

పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ చైర్మన్ గణేశ్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భాగ్యలక్ష్మి

కాచిగూడ, అక్టోబర్ 22: మహిళా బిల్లులో ఉపకోటా కల్పించి, లోక్‌సభలో అమోదించాలని జాతీయ ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ చైర్మన్ గణేశ్‌సింగ్ నగరానికి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి మహిళా బిల్లులో ఉపకోటా కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం అమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళలకు బీజేపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేకని పేర్కొన్నారు. క్రీమిలేయర్ కోటాను రూ.30 లక్షలకు పెంచాలని, ఓబీసీ ఉద్యోగులకు కేంద్రం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి చట్ట బద్ధత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నయ్య, రవికుమార్, జయప్రకాశ్, లలితా చందన, శ్రీనివాస్‌గౌడ్, యాకయ్య, పూర్ణ చందర్‌రావు, శ్రీధర్, రమేశ్, ఎస్.చారి పాల్గొన్నారు.

ఓయూ వీసీకి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతిగా బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను మంగళవారం నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

– సుల్తాన్‌బజార్,అక్టోబర్ 22

బాలుడిపై లైంగిక దాడి, హత్య చేసిన.. నిందితుడికి యావజ్జీవ శిక్ష

మెహిదీపట్నం, అక్టోబర్ 22: ప్రకృతికి విరుద్ధంగా 12 ఏండ్ల బాలుడిపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన నిందితుడికి పోక్సో కోర్టు మంగళవారం యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ పత్రికా ప్రకటనలో వివరాలు వెల్లడించారు. లంగర్‌హౌస్ ఫ్లోర్ మిల్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఓ గదిలో 2018, జూలై 4వ తేదీ రాత్రి ఓ పన్నెండేండ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. షేక్ తాజ్ అనే యువకుడు బాలుడిపై లైంగిక దాడి చేసి, హత్య చేసినట్లు తేల్చారు. దీనిపై కోర్టులో సాక్ష్యాధారాలను సమర్పించడంతో పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం మంగళవారం ఎఫ్‌టీఎస్‌సీ పోక్సో కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. పోక్సో కోర్టు జడ్జి పుష్పలత ఈ తీర్పునిచ్చారని ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపారు.

కాచిగూడ రైల్లో దొంగతనం

కాచిగూడ, అక్టోబర్ 22: కాచిగూడ సూపర్ ఫాస్ట్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు, ఫోన్‌ను గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. సూర్యాపేట మన్యాతండాకు చెందిన బానోతు మంగమ్మ(48) సూపర్ ఫాస్ట్ వీక్లి రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్కేలి-ముత్‌కేడ్ రైల్వేస్టేషన్ల మధ్య బ్యాగు చూసుకునే సరికి అందులో ఉన్న 35 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 వేలు, ఖరీదైన ఫోన్‌ను దొంగిలించారు. మంగళవారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.

ప్రాచీన కళారూపాలను కాపాడుకొనేందుకు మరింత కృషి జరగాలి

● ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 22: తెలుగు నాటకరంగానికి రేపాల గ్రామం పునాదివేసి ఎంతోమంది కళాకారులకు స్ఫూర్తినిచ్చిందని వక్తలు ప్రశంసించారు. తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో తెలంగాణ తొలి మాండలిక నాటకరచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతి సందర్భంగా నాటకోత్సవాలు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. ప్రాచీన కళారూపాలను కాపాడుకునే కృషి మరింతగా జరగాలని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. తెలంగాణ అస్థిత్వంతో కె.ఎల్ నరసింహారావు శతజయంతి వేడుకలు జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని పూర్వ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్మన్ బాద్మి శివకుమార్, దర్శకులు గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొని నరసింహారావు రచనాశైలిని ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ థియేటర్ సమర్పణలో కె.ఎల్ నరసింహారావు రచించిన ఉంగరాల వేళ్లు నాటికను మేకా రామకృష్ణ దర్శకత్వంలో నటీనటులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్మిక చట్టాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ లీగల్ అథారిటీ స్పెషల్ సెల్ సభ్యుడు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పి.రామారావు అన్నారు. మంగళవారం టోలిచౌకిలో లేబర్ అడ్డా వద్ద కార్మిక చట్టాలు, ప్రభుత్వ పథకాలపై కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించి వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

–మెహిదీపట్నం, అక్టోబర్ 22

ఏఐవైహెచ్‌పీఎస్ సంఘానికే కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రవీంద్రభారతి,అక్టోబర్ 22 : ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి (ఏఐవైహెచ్‌పీఎస్) సంఘానికి చెందిన వారికే కేటాయించాలని ఏఐవైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదరాయ సాయిలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎరుకల తెగ ప్రజల అభివృద్ధికి ఏకలవ్య కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.బలరాం, రవి ఎరుకల, ఎం.కృష్ణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

కార్వాన్, అక్టోబర్ 22: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని తాళ్లగడ్డ హనుమాన్ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెండి మకర తోరణ ప్రత్యేక పూజలు మంగళవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి భక్తుల కోలాహలం మధ్య రాత్రి 7 గంటల వరకు కొనసాగాయి. మొదటి అభిషేకంతో ప్రారంభమైన పూజలు మండపారాధన, 121 కలశాలతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు ఆకుల రాజ గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారెడ్డి దుర్గాదాస్ యాదవ్ లతో పాటు ప్రతినిధులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

అంబర్‌పేట, అక్టోబర్ 22 : నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్‌లో కలుషిత మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ వై.అమృత అధికారులకు చెప్పారు. డివిజన్‌లోని సంజీవయ్యనగర్‌లో మంచినీరు కలుషితమై వస్తుందని అక్కడి ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో ఆమె జలమండలి మేనేజర్ రోహిత్‌తో కలిసి పర్యటించి కలుషిత మంచినీటిని గమనించి వెంటనే పరిష్కరించాలని అన్నారు.

అన్నదానం

పేదల ఆకలిని తీర్చడానికి అన్నదానాలు ఎంతగానో దోహదపడుతాయని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. చెప్పల్‌బజార్‌లోని ఈదమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్, నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్ యాదవ్ పాల్గొని అన్నదానం చేశారు. – కాచిగూడ

కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసే కార్యకర్తలకు అండగా ఉంటామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ కుంటలో నివసించే ఎంఐఎం సీనియర్ నాయకుడు మాజీద్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. మాజీద్‌కు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. దీని గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే అతని ఇంటికి వెళ్లి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 22

నేడు శిల్పారామంలో 'మెథడిస్' వార్షికోత్సవాలు

అబిడ్స్, అక్టోబర్ 22 : మెథడిస్ట్ ఇంజినీరింగ్ టెక్నాలజీ వార్షికోత్సవాలను బుధవారం శిల్ప కళావేదిక ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి. బెనకాప్ అన్నారు. బుధవారం ఉదయం నుంచి శిల్పారామంలోని శిల్ప కళావేదిక ఆడిటోరియంలో కళాశాల కరెస్పాండెంట్ కె. కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కుమార్ మొలుగరమ్, ప్రత్యేక అతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ గౌడ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

శాంతి సామరస్యాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయి

అవార్డులను ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 22 : శాంతి సామరస్యాలు దేశ సమైఖ్యతకు సమాజం అభివృద్ధికి దోహదపడతాయని వక్తలు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో మహాత్మాగాంధీ జయంతి, అహింసా దినోత్సవ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ రంగాలో రాణిస్తున్న పలువురికీ మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డులను ప్రధానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్, బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల